బడి కోసం.. నిలబడి

ఏడాదిగా మూతబడిన బడిని ఎలాగైనా తెరిపించుకోవాలని ఆ ఉపాధ్యాయులు అలుపెరుగని కృషిచేశారు. పిల్లలను సర్కార్ బడికే పంపించాలని ఇంటింటా తిరిగారు. బడిబాట పట్టి సమావేశాలు నిర్వహించారు. చిన్నారుల భవిష్యత్‌ను తీర్చిదిద్దుతామని తల్లిదండ్రులను ఒప్పించారు. ఫలితంగా పిల్లలు సర్కార్ బడిబాట పట్టారు.

విద్యకు కొండంత అండ

రేగొండ ఉపాధ్యాయులు

- 35 మంది విద్యార్థుల ప్రవేశాలు
- ఫలించిన అలుపెరుగని కృషి
- పూర్వవైభవం దిశగా సర్కార్ బడి



పాఠశాలకు తరలి వస్తున్న విద్యార్థులు

హుస్నాబాద్: అక్కన్నపేట మండలం రేగొండ ప్రాథమికోన్నత పాఠశాలలో గతంలో 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు బోధన సాగేది. కాని ఊళ్లో పిల్లలంతా ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లడంతో ఏడాది కాలం ఈ పాఠశాల మూతపడింది. దీంతో ఆ స్కూలుకు చెందిన ఐదుగురు ఉపాధ్యాయులు పక్కనున్న గ్రామాల్లోని పాఠశాలలకు డిప్యూటేషన్‌పై వెళ్లారు.

తిరిగి ప్రారంభించడమే లక్ష్యంగా..

అయితే ఈ విద్యా సంవత్సరంలో ఎలాగైనా సరే పాఠశాలను పునఃప్రారంభించాలని ఉపాధ్యాయులు, విద్యాధికారులు కంకణం కట్టుకున్నారు. ఏప్రిల్ 15 నుంచి జూన్ 12 వరకు ఎంఈఓ, డీఈఓలు కలిసి ఉపాధ్యాయులు ఇంటింటికి తిరిగారు. గ్రామస్తులతో సమావేశాలు నిర్వహించారు. నాణ్యమైన విద్య, మధ్యాహ్న భోజనం, ఉచితంగా పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫారాలతోపాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, ఆర్థిక భారాన్ని తగ్గించుకోవచ్చని భరోసా ఇచ్చారు. ఉపాధ్యాయులపై ఏర్పడ్డ నమ్మకంతో తమ పిల్లలను సర్కార్ బడికే పంపిస్తామని గ్రామస్తులంతా ప్రతిజ్ఞ చేశారు.



భోజనం కోసం క్యూలో నిలిచిన చిన్నారులు

పూర్వ వైభవం దిశగా..

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పించారు. ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్, గత కలెక్టర్ మనుచౌదరి, డీఈఓ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పాఠశాలను పునః ప్రారంభించారు. బడిలో టాయిలెట్లు, ప్రహరీ, మినరల్ వాటర్ లాంటి సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు. 15 రోజుల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చి తల్లిదండ్రులకు భరోసానిచ్చారు. దీంతో విద్యార్థులు బడిబాట పట్టారు. ప్రస్తుతం 1 నుంచి 5వ తరగతి వరకు ముగ్గురు ఉపాధ్యాయులతో ఆంగ్లంలో విద్యాబోధన చేస్తున్నారు. ప్రస్తుతం 35 మంది విద్యార్థులు పాఠశాలకు వస్తున్నారు. మిగిలిన వారు కూడా సర్కార్ బడికి వచ్చేలా కృషిచేస్తున్నారు.

పేరెంట్స్ తనిఖీలు

పాఠశాలలో బోధన, మధ్యాహ్న భోజనం ఎలా ఉందో చిన్నారుల తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఏమైనా సమస్యలుంటే ఉపాధ్యాయులు, పేరెంట్స్‌తో చర్చించి నివృత్తి చేసుకుంటున్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి ప్రభుత్వ పాఠశాలను నిలబెట్టడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సహకారం అందిస్తాం



మూతబడిన బడిని మళ్లీ తెరిపించుకున్నాం. ఇప్పటికి 35 మంది పిల్లలు బడికి పోతాండ్లు. మరికొంత మంది ఉన్నారు. ప్రైవేట్ బస్సులను బంద్ చేయించి వాళ్లను కూడా సర్కార్ బడికి పంపిస్తాం. బడి మంచిగా నడవడానికి గ్రామస్తులందరం సహకారం అందిస్తాం. ప్రభుత్వ పాఠశాలను నడిపించేందుకు కృషి చేస్తాం.

– రామచంద్రం, గ్రామస్తుడు, రేగొండ

పాఠశాలను మరింత బలోపేతం చేస్తాం



మూతబడిన బడిని తెరిపించేందుకు గ్రామస్తులతో మాట్లాడాం. విద్యార్థుల భవిష్యత్‌కు భరోసా కల్పించాం. గ్రామస్తులు, తల్లిదండ్రులు మాపై నమ్మకంతో 35 మంది విద్యార్థులను పాఠశాలకు పంపించారు. ప్రత్యేక శ్రద్ధ వహించి నాణ్యమైన బోధన అందిస్తాం. పాఠశాలను తిరిగి ప్రారంభించేందుకు సహకరించిన మంత్రి పొన్నం, కలెక్టర్, డీఈఓ, ఎంఈఓలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

– రవీందర్, పాఠశాల హెచ్‌ఎం, రేగొండ

క్లుప్తంగా

పాములు ప్రకృతి నేస్తాలు



పాములపై అవగాహన కల్పిస్తున్న సాదత్ అలీ

దుబ్బాకటౌన్: అందరికీ పాములపై అవగాహన ఉండాలని హెచ్‌ఎం సాదత్ అలీ అన్నారు. ధర్మాజీపేట జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాములు గురించి పాములు పట్టే నిపుణుడితో విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాము కాటు వేసినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాములు ప్రకృతికి ఏ విధంగా సహకారిస్తాయనే విషయాలను విద్యార్థులకు వివరించామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్‌గౌడ్, కృష్ణమాచారి, కృష్ణమూర్తి, నరేశ్, శ్రీకాంత్, శ్రీనివాస్ రెడ్డి, బాలకృష్ణ, దినేష్, పద్మావతి తదిరులున్నారు.

విద్యార్థులను ప్రేరేపిస్తున్న దాతలు



విద్యార్థులకు షూస్‌ను అందిస్తున్న గోపాల్

దుబ్బాకటౌన్: మూడేళ్లుగా మూతపడిన బడి నేడు 20 మంది విద్యార్థులతో కళకళలాడుతోంది. ఈ క్రమంలో దాతలు కూడా ముందుకు వస్తున్నారు. ఇటీవల అఖిలరాజ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సత్యనారాయణ విద్యార్థులకు క్రీడా దుస్తులు అందించారు. దుబ్బాకకు చెందిన బిల్ల గోపాల్ శుక్రవారం విద్యార్థులకు షూస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించిన ఎంతో మంది నేడు ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. రానున్న రోజుల్లో మరింత సేవలు అందించడానికి సిద్ధంగా ఉంటానన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నూర్‌బాబు, రాములు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి ఆలయంలో చేపడుతున్న అభివృద్ధి పనులను ఆలయ ఈఓ అన్నపూర్ణ శుక్రవారం అధికారులతో కలసి పరిశీలించారు. బండగుట్టపై నిర్మిస్తున్న 50 వసతి గదుల పురోగతిని ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వచ్చే నెలలోగా నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. అంతకు ముందు హైదరబాద్‌కు చెందిన భక్తులు జ్వాల సత్యానారాయణ పుట్టినరోజు సందర్భంగా స్వామి ఆగమపాఠశాల విద్యార్థులకు పండ్లు, వస్త్రాలను ఆయనతో కలసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్, పంచాయతీ రాజ్ డీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ పర్యవేక్షకుడు సురేందర్‌రెడ్డి, ఏఈ భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ప్రారంభం



వ్యాపారవేత్తను సన్మానిస్తున్న సీఐ లతీఫ్

తొగుట(దుబ్బాక): సీసీ కెమెరాల ఏర్పాటుకు అందరూ సహకరించాలని సీఐ ఎస్‌కే లతీఫ్ కోరారు. వ్యాపారవేత్త క్యాస రాజుకు చెందిన దుకాణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సీఐ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల సంఖ్య తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రవికాంత్‌రావు, నర్సింహారెడ్డి, చంద్రంగౌడ్, కృష్ణ, శేఖర్, అన్వర్, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

యువతకు అల్లూరి స్ఫూర్తి



అల్లూరి చిత్రంతో రామకోటి రామరాజు

గజ్వేల్‌రూరల్: విప్లవ వీరుడు అల్లూరిని నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని రామకోటి భక్త సమాజం వ్యవస్థాపకుడు రామకోటి రామరాజు అన్నారు. అల్లూరి సీతారామరాజు 128వ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం ఆయన ఎర్రపప్పుతో అల్లూరి సీతారామరాజు రూపాన్ని చిత్రించి నివాళులర్పించారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

హుస్నాబాద్: మున్సిపల్ పరిధిలో వంద రోజుల కార్యచరణలో భాగంగా శుక్రవారం కేబీ కాలనీలో మున్సిపల్ అధికారులు ఫ్రైడే డ్రైడే నిర్వహించారు. ఇంటింటికి తిరిగి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, పర్యావరణ అధికారి రవికుమార్ పాల్గొన్నారు.

క్యాంపు కార్యాలయంపై మళ్లీ రగడ



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న బీజేపీ నేతలు

బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకుల ఫిర్యాదులు

గజ్వేల్: మాజీ సీఎం కేసీఆర్ క్యాంపు కార్యాలయంపై మరోసారి రగడ నెలకొంది. గతంలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఈ కార్యాలయాన్ని ముట్టడించి కేసీఆర్ ఇక్కడికి రావడం లేదని నిరసన తెలిపిన సంగతి తెలిసిందే. అయితే ఈ కార్యాలయాన్ని బీఆర్‌ఎస్ నేతలు పార్టీ కార్యాలయంగా వాడుకుంటున్నారని బీజేపీ నేతలు దేవులపల్లి మనోహర్, ఉప్పల మధుసూదన్, నాగు, కుమార్, పంజాల రాజుగౌడ్ తదితరులు శుక్రవారం ఆర్‌డీఓ వీవీఎల్ చంద్రకళకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ నిధులతో నిర్మించిన కార్యాలయాన్ని బీఆర్‌ఎస్ నేతలు ఎలా వాడుకుంటున్నారని ఆరోపించారు. దీంతో బీఆర్‌ఎస్ గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, నాయకులు బొగ్గుల సురేశ్, ఉమర్, బొగ్గుల చందు, కరీం తదితరులు బీజేపీ నాయకులపై మండిపడ్డారు. ఈ క్యాంపు కార్యాలయానికి అన్ని పార్టీల నాయకులు వస్తారన్నారు. సీఎం సహాయనిధి కోసం దరఖాస్తు చేయడం, ఇతర సహాయం కోసం ప్రజలకు సేవలందిస్తున్నామని చెప్పారు. ఇది తెలుసుకోకుండా బీజేపీ నాయకులు మతిస్థిమితం కోల్పోయి విమర్శలు చేస్తున్నారని, గజ్వేల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



బీజేపీ నేతలపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

రోడ్డు పనులు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..

అక్కన్నపేట(హుస్నాబాద్): హుస్నాబాద్ –రామవరం వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులను అధికారులు ప్రారంభించారు. 'శంకుస్థాపన ఘనం.. పనులు శూన్యం' హుస్నాబాద్–రామవరం డబుల్ రోడ్డుకు మోక్షమెుప్పుడో అనే శీర్షికన 30న సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించారు. శుక్రవారం ఆర్‌అండ్‌బీ ఏఈ రాహుల్ మాట్లాడుతూ శరవేంగా రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతాయన్నారు. ప్రస్తుతం హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు మత్తడి నుంచి పనులను ప్రారంభించినట్లు తెలిపారు. ఎన్నో యేళ్లుగా సింగిల్ రోడ్డుతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులకు డబుల్ రోడ్డు అందుబాటులోకి వస్తుందని, నాణ్యత ప్రమాణాలతో పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించినట్లు చెప్పారు.



ప్రారంభమైన డబుల్ రోడ్డు నిర్మాణ పనులు

కార్యదర్శిపై విచారణ

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని మర్రిముచ్చాల పంచాయతీ కార్యదర్శి రాజమణిపై గ్రామస్తులు చేసిన ఫిర్యాదు మేరకు డీఎల్‌పీఓ మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసవర్మతో కలసి శుక్రవారం విచారణ చేపట్టారు. ధ్రువపత్రాలు ఇవ్వడంలో జాప్యం చేస్తునట్లు వచ్చిన విషయంపై విచారణ చేపట్టామని, పూర్తి విచారించి ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి సిద్దిపేట కోర్టు జరిమానా, జైలు శిక్ష విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. పట్టణంలోని పలు ప్రాంతాలలో ఐదు రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో తొమ్మిది మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి వారికి రూ.13,500 జరిమానా, వారిలో ఒకరికి ఎనిమిది రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

నీటిని పొదుపుగా వాడండి

దుబ్బాకటౌన్: కొండపాకలోని మిషన్ భగీరథ పైపు లైన్ మరమ్మతుల కారణంగా 15 రోజులపాటు మున్సిపల్ పరిధిలో నీటి సరఫరా తక్కువగా ఉంటుందని, పొదుపుగా వాడుకోవాలని మున్సిపల్ కమిషనర్ రమేశ్ కుమార్ సూచించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుడి మృతి



ఆగంరెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండలంలోని బైరాన్‌పల్లికి చెందిన స్వాతంత్య్ర సమరయోధుడు ఇమ్మడి ఆగంరెడ్డి(97) శుక్రవారం రాత్రి మృతి చెందారు. సమరయోధుల సంఘం అధ్యక్షుడిగా కూడా ఆయన ఎంతో కృషిచేశారని పలువురు నేతలు అన్నారు. అతడికి ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ కల్లుగీత కార్మికుల కష్టాలు తీరవా?

అక్కన్నపేట(హుస్నాబాద్): కల్లుగీత కార్మికులకు కాంగెస్ ఇచ్చిన హామీలు అమలు కావడంలేదని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు రవీందర్‌గౌడ్ వాపోయారు. జనగామ గ్రామంలో కల్లుగీత కార్మికులతో కలిసి ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కొత్త పెన్షన్లకు అవకాశం ఇవ్వకపోవడం వల్ల 18 నెలల నుంచి పాత పెన్షన్ల ప్రకారం అర్హత పొందిన వారికి రూ.36 వేలు నష్టం జరిగిందన్నారు. పింఛన్లు పెంచాలని, కమ్యూనిటీ హాల్ నిర్మించాలని డిమాండ్ చేశారు. భిక్షపతి గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, తాళ్లపల్లి శ్రీనివాస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

◆ చదువుతో ఏదైనా సాధించవచ్చు

చేర్యాల(సిద్దిపేట): చదువు ఉంటే ఏదైనా సాధించవచ్చని ప్రొబేషనరీ ఎస్‌ఐ సమత అన్నారు. మండలంలోని ముస్త్యాల ఉన్నత పాఠశాల విద్యార్థులకు చట్టాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ మహిళల భద్రతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామన్నారు. డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హుస్నాబాద్ షీ టీం సదయ్య, ప్రశాంతి, స్వప్న, కృష్ణ, హెచ్‌ఎం పద్మలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ లేబర్ కోడ్‌లను రద్దుచేయాలి

తొగుట(దుబ్బాక): కార్మికులకు తీవ్రంగా నష్టం కలిగించే నాలుగు చట్టాలను రద్దుచేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి భాస్కర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు చట్టాలను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ 9న దేశవ్యాప్తంగా చేపట్టిన సమ్మెలో కార్మికులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. నాయకులు మద్దూరి వసంత, సాజిద్, ప్రవీణ, లక్ష్మి, నర్సింహులు, పోశయ్య, కనకరాజు, మల్లేశం, బాల్‌రాజు తదతరులు పాల్గొన్నారు.

◆ రైల్ రోకోకు ముదిరాజ్‌ల మద్దతు

గజ్వేల్‌రూరల్: కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయడంతోపాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ 17న ఎమ్మెల్సీ కవిత చేపట్టిన రైల్ రోకో కార్యక్రమానికి మద్దతు తెలుపుతున్నామని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి చెప్పారు. హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కవితకు శుక్రవారం మద్దతు లేఖను అందించారు.

◆ కంది విత్తనాలు పంపిణీ

గజ్వేల్: స్థానిక రైతు వేదికలో ఏడీఏ బాబూనాయక్, వ్యవసాయాధికారి నాగరాజు రైతులకు శుక్రవారం కంది విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పప్పుధాన్యాల సాగును పెంచేందుకు ప్రభుత్వం ఈ విత్తనాల పంపిణీ చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు సౌజన్య, మాధవి, రమ, నర్సింహులు, నలిన్, గణేశ్, కవిత తదతరులు పాల్గొన్నారు.

అవగాహనలేని మంత్రులు ఉన్నా లేనట్టే..

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రజా సంక్షేమంపై అవగాహనలేని మంత్రులు జిల్లాలో ఉన్నా లేనట్టేనని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి యాదవ సంఘం భవనానికి ప్రారంభోత్సవం చేశారు. పీహెచ్‌సీ ప్రహరీ నిర్మాణంతోపాటు పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు వారిని గొంగడి, గొర్రెపిల్లతో ఘనంగా సన్మానించారు. అనంతరం పీహెచ్‌సీలో రోగులకు అందుతున్న చికిత్సలపై ఆరా తీశారు. రోగులకు అరకొరగా అందుతున్న వైద్య సేవలపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో స్కూల్ డెస్కులను, కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యశాఖ మంత్రి సొంత జిల్లా వాసి అయినప్పటికీ ప్రజారోగ్యంపై దృష్టి సారించక పోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో రవి, సూకూరి లింగం, అహ్మద్, అబ్బుల బాలాగౌడ్, శ్రీనివాస్, యాదగిరి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



యాదవ సంఘం సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, వెంకటయ్య

క్రీడలతో ఉల్లాసం

దౌల్తాబాద్(దుబ్బాక): క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని దొమ్మాటలో గురుదత్త పీఠాధిపతి శ్రీరాంచరణ్ శర్మ గురూజీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన నియోజకవర్గ క్రికెట్ ముగింపు కార్యక్రమంలో పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, శ్రీనివాస్, పూజిత, అహ్మద్, సింహాచలం, కనకయ్య, షబ్బీర్ పాల్గొన్నారు.

ఇళ్ల పంపిణీలో పేదలను మరిచిన కాంగ్రెస్

సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి

చేర్యాల(సిద్దిపేట): ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలను మరిచిందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి మండిపడ్డారు. కల్యాణి గార్డెన్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో అనర్హులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ చేశారని శుక్రవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆధ్వర్యంలో జరగాల్సిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీని కాంగ్రెస్ నాయకులు నిర్వహించడం ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ సభగా మార్చిన కలెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరుపేదలు, గుడిసెల్లో నివసించే వారు, వితంతువులు, దివ్యాంగులను విస్మరించారని, ఆ జాబితాను పునఃసమీక్షించి అనర్హులను తొలగించాలన్నారు. కార్యక్రమంలో సత్తిరెడ్డి, వెంకట్‌మావో, అరుణ్, నాగరాజు, శోభ, భాస్కర్, ప్రభాకర్, మల్లేశం, అశోక్, హస్గర్, ఇబ్రహీం, రాజు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్‌పై కాంగ్రెస్ నేతల ఆందోళన

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రొటోకాల్ పాటించడంలో బీఆర్‌ఎస్ నాయకులు, అధికారులు నిర్లక్ష్య ధోరణి వహిస్తున్నారంటూ కాంగ్రెస్ నాయకులు పీఏసీఎస్ నూతన భవనం ఎదుట బైఠాయించారు. శుక్రవారం పీఏసీఎస్ నూతన భవన నిర్మాణాన్ని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించాల్సిన శిలాఫలంలో ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్‌రెడ్డి పేరు లేదంటూ కాంగ్రెస్ నాయకులు ఆందోళనకు దిగారు. పోలీసులు అక్కడకు చేరి నాయకులకు నచ్చజెప్పినా ఫలితం లేకపోయింది. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ విషయం తెలియడంతో పీఏసీఎస్ నూతన భవన ప్రారంభోత్సవానికి రాకుండా ఎమ్మెల్యే అటు నుంచి అటే వెళ్లిపోయారు. దీంతో నూతన భవన ప్రారంభోత్సం వాయిదా పడింది. సీఐ శ్రీనివాస్ నాయకులకు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. సీనియర్ నాయకులు ప్రతాప్, మధు, శ్రీధర్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

మనబడిపై మమకారం ఉండాలి

ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): మనబడిపై మమకారం పెంచుకుని సహకారం అందించుకోవడంతోనే పాఠశాలలు బలోపేతం అవుతాయని ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. స్థానిక హైస్కూల్లో హెచ్‌ఎం విఠల్ నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం 'తల్లి ఒడి.. మన బడి' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాల బలోపేతం కోసం ఉపాధ్యాయులందరం కలిసి ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పారిశ్రామిక వేత్తలు, మాజీ ప్రభుత్వ ఉద్యోగులను భాగస్వాములను చేస్తున్నామని చెప్పారు. ఎన్నారై దొమ్మాట బాలకృష్ణారెడ్డి తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ.50 వేల విలువైన జిరాక్స్ మిషన్‌ను అందజేశారు. పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు జానకిరాంరెడ్డి, విజయ్‌కృష్ణ, సంజయ్‌కృష్ణ, వేణు, మాధవరెడ్డి, ఉపాధ్యాయులు రఘువర్ధన్‌రెడ్డి, రామస్వామి, హారతి, మహేందర్‌రెడ్డి కనకయ్య, సత్యలక్ష్మి, రాకేశ్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జిరాక్స్ మిషన్‌ను అందజేస్తున్న బాలకృష్ణారెడ్డి

రోశయ్య జీవితం స్ఫూర్తిదాయకం

డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి

గజ్వేల్: దివంగత సీఎం కొణిజేటి రోశయ్య జీవితం స్ఫూర్తిదాయకమని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. రోశయ్య జయంతి సందర్భంగా శుక్రవారం గజ్వేల్‌లో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతమైన వ్యక్తిత్వం, క్రమశిక్షణ కలిగిన రోశయ్య ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. హైదరాబాద్‌లో రోశయ్య విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠించడం అభినందనీయమని చెప్పారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్: రోశయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నర్సారెడ్డి తదితరులు

ప్రజాసేవలో సుదీర్ఘకాలం

సిద్దిపేటకమాన్: మాజీ ముఖ్యమంత్రి రోశయ్య సుదీర్ఘకాలంగా ప్రజాసేవలో నిమగ్నమయ్యారని అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్ అన్నారు. రోశయ్య జయంతి సందర్భంగా పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 16 సార్లు ఆర్థిక మంత్రిగా బడ్జెట్ ప్రవేశపెట్టిన అరుదైన ఘనత సాధించారన్నారు. ఏఓ యాదమ్మ, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొమురయ్య ఆశయాలను సాధిద్దాం

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య ఎంతో ఆదర్శప్రాయుడని పలువురు నాయకులు కొనియాడారు. జిల్లా వ్యాప్తంగా కురుమ, యువజన సంఘాల ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు.



సిద్దిపేటరూరల్: దొడ్డి కొమురయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కురుమ నాయకులు



చేర్యాల(సిద్దిపేట): అంగడి బజార్ వద్ద..



జగదేవ్‌పూర్(గజ్వేల్): తిగుల్‌లో ..



నంగునూరు(సిద్దిపేట): సిద్దన్నపేటలో..